వారంటూ ఎవ్వరూ లేకపోయారు. అసలు నావారనేవారు లేకుండాపోబట్టే, నే నీ విజయాన్ని సాధించడం జరిగింది. వీలుంటే - నాకోసారి కనిపించండి - కుశాల్ రావు."

పోనీ, ఓసారి వెళ్లొద్దామా—అనుకొని కూడా మానేశాను. అతని ఉత్తరానికి - కనీసం జవాబుగూడ రాయ లేదు. అతనికి తెలుసు - నే నొకణ్ణే అతని మిత్రుణ్ణనీ, తప్పకుండా తనను చూడడాని కొస్తాననీనూ. కానీ, ఈ రెండు పన్లూ చేసి, అతని మనశ్శాంతిని పాడుచెయ్యబుద్ధి కా లేదు.

కుశాల్ రావును గురించి, నాకున్నదల్లా ఒక్కటే దిగులు. భార్యా బిడ్డలు చనిపోయారని, కనక వారి బాధ్యతలు తనకేమీ లేవన్న ఆలోచనే, అత నిప్పుడు అనుభవిస్తున్న సుఖానికీ, హాయికీ, మూలబీజాలు. కాని, అతనను కొంటున్నట్టుగా వారు చనిపోలేదని, ప్రస్తుతం హాస్పిటల్లో వుండి, క్రమంగా కోలుకుంటున్నారని తెలిసినపుడు కుశాల్ రావు ఏమౌతాడా అని !

# చేదు ఫలం

లోకంలో రకరకాల మూర్ఖులున్నారు. వారిలో కొందర్ని మనం భరించగలం. మరికొందర్ని బొత్తిగా భరించలేం. ఈ భరింపలేని శాఖలోకే శంకరంగూడా వస్తాడని సుందరం అభిప్రాయం. మొన్న మొన్నటిదాకా వాడు యిలాంటివాడని ఎవ్వరికీ తెలీదు. వాడిలో ఇంతటి 'సంస్కార

హృదయం' ఉన్నదనిగూడా ఎవ్వరికీ తెలీదు. ఉన్నట్టుండి తను శారదను పెళ్ళాడబోతున్నట్టు వాడు ప్రకటించాడు. ఆ ప్రకటన ఎంత అలజడి రేపాలో, అంతా రేపింది.

'అయితే ఈమాట నిజమే నంటావా ?' అన్నాడు సుందరం.

'ఏం ? నీ కా అనుమాన మెందుకు కలిగింది ?' అన్నాడు శంకరం.

'ఎందుక్కలగ్గూడదూ? ఏ మాత్రం బుద్ధీ జ్ఞానమూ ఉన్నవాడయినా, ఈపని చేయడనుకొంటాను. నన్ను నువ్వ పార్థంచేసుకొంటే చెప్పలేనుగానీ, శారదను నువ్వు పెళ్ళాడ్డ మేమిట్రా? నువ్వు చేసుకొందుకు అంతకన్నా మంచి సంబంధమే దొరకలేదా?' అన్నాడు సుందరం.

'మంచి అనే పదాన్ని నువ్వు ఏ అర్థంలో వాడుతున్నావో ముందు నాకు చెప్పాలి. ఎందుకంటే, నువ్వెంతో మంచిగా భావించేదాంట్లో నాకు చెడ్డ కనిపించవచ్చు. అట్లాగే నేను మంచిదనుకొంటున్నదే, నీకు కాకపోనూ వచ్చు. ఈ రెండవదానికి ఉదాహరణ ఇప్పుడు నువ్వు నాతో వాదించడం చాలు. లోకంలో రకరకాల మనస్తత్వాలున్న వాళ్ళుంటారనీ, వారందరికీ రకరకాలయిన అభిరుచులుంటాయనీ తెలిస్తే, నువ్విట్లా అని ఉండవు' అన్నాడు శంకరం.

'నువ్వింతగా మాట్లాడినదాని సారాంశమల్లా ఆవిణ్ని పెళ్ళాడ్డం చాలా మంచి కార్యమనేకదూ ?' అన్నాడు సుందరం, 'నేను, నీ వ్యక్తిత్వాన్ని అనుమానించడం లేదు

భాయీ! ఏ పనిచేసినా నువ్వు మనస్ఫూర్తిగా చేస్తావనే నమ్మకం నాకుంది. అందులో నా కెలాంటి అనుమానమూ లేదు.'

'మరింకేం?' అన్నాడు శంకరం, సన్నగా నవ్వుతూ.

'వస్తున్నాను.' అన్నాడు సుందరం, మిత్రుని కేసి అదోలాచూస్తూ, 'కానీ, ఈ మనస్సనేదాన్ని, ఎంతవరకూ విశ్వసించాలనేదే ఇప్పుడు తేలాలి. ఎందుకంటే, ఇది ఒక్కోసారి ఒక్కోలా చెబుతుంటుంది. ఒక్కోపని, వెనకాముందూ చూడకుండా చేసెయ్యమని మనల్ని ముందుకు నెడుతుంటుంది. అలా చేశామంటే, కొన్ని కొన్నిసార్లు మట్టి గొట్టుకుపోతాం. నా మట్టుకు నాకు, మన ఊరి చైర్మన్‌గారి మరదలుమీదికి అనేకసార్లు మనస్సు ఉరుకులుబెట్టింది. పెట్టిందిగదా అని - అమాంతం ఆవిడమీద పడ్డట్లయితే, ఏమయిఉండేదో నీకు తెలీకపోదు!'

'ఇన్నిటికీ నువ్వనే దేమిట్రా ?' అన్నాడు శంకరం విసుగ్గా.

'అదే అంటుంటే, నువ్వు మధ్యమధ్య అడ్డు తగుల్తున్నావు మరి—' అన్నాడు సుందరం, చిరు చెమటను తుడుచుకొంటూ. 'ఇన్నిటికీ, నేను చెప్పదలుచుకొన్నదల్లా ఇది; శారదను పెళ్ళాడి తీరవలసిందని, నీ మనస్సు నీకు పోరుబెట్టి చెబుతున్నమాట నిజం! కానీ, మనస్సనేది, అన్నివేళలా సక్రమంగా ఉండేదికాదనీ, దిక్కుమాలిన కోరికలన్నీ దానికి కలుగుతుంటాయనీ, నువ్వు గ్రహించాలి. అది చెప్పి

నట్లు చేయడం, కొన్ని సందర్భాల్లో ఆత్మ తెలివైన పనికాదు. అదీగాక, నీ మనస్సు నీకు సక్రమమైన బోధే చేసిందనేందుకు రుజువుగూడా లేదు.'

'అబ్బాయ్ !' అన్నాడు శంకరం, ఓ క్షణం కళ్ళు మూసుకొని, 'మనిద్దరం ఇలా వాదించుకోడం నా కాత్తే నచ్చలేదు. నేను చేసేపని మంచి చెడ్డలను గురించి, బైటివారు చర్చించడం గూడా నా కిష్టంలేదు. వారి కేవో అభ్యంతరా లున్నాయని, నేను నా ఉద్దేశాన్ని మార్చుకోను-మార్చు కొనితీరాలనే నువ్వంటే—నా ఉద్దేశాన్ని మీరెందు కంగీక రించగూడదని, నే నడగవలసి ఉంటుంది.'

సుందరం ఓ నిమిషంపాటు ఏమీ మాట్లాడలేదు. తరువాత గట్టిగా కళ్లు నులుముకొని ఓ సిగరెట్టు ముట్టించాడు. కళ్ళు కొంచెం ఎరుపెక్కాయి.

'ఎన్నడూ లేనిది ఈ రోజు నీతో చాలా లోతుగా వెళ్ళాను గదూ?' అన్నాడు సుందరం.

శంకరం ఏమీ మాట్లాడలేదు.

'స్నేహితుణ్ని గనుక, అందునా నీ బాగోగుల్ని కోరే వాణ్ని గనుక, ఇంతదూరం రావలసివచ్చింది. శారదనే ఎందుకు చేసుకొంటున్నావని నిన్ను నే నడగను. నీ మనస్సు నీకలా చెప్పిఉండొచ్చు. కానీ, లక్షణమైన మేనరికాన్ని ఎందు కొదులుకున్నావో అదన్నా చెప్పు' అన్నాడు సుందరం.

'అందుకు నా మనస్సు ఒప్పుకోలేదు.'

'ఎందుకు?' అన్నాడు సుందరం, స్నేహితుని కేసి ఆశ్చ ర్యంగా చూస్తూ. 'సమాధానం చెప్పడానికా?'

'అబ్బే కాదురా! జానకిని చేసుకోనేందుకు' అన్నాడు శంకరం నవ్వి.

'అయితే నీమనస్సుకు బాగా జబ్బుచేసిందన్నమాట. అలాంటిదాన్ని ఎక్కువకాలం అలానే ఉంచుకోడం క్షేమం కాదు. ముందు దాన్ని కాస్త బాగుచేయించు' అన్నాడు సుందరం. 'చాలా దగ్గరి సంబంధం, అందులోనూ మేన మామ కూతురు. ఒక్కతేపిల్ల. వెనక చాలాడబ్బు మూలుగు తోంది. అదీగాక జానకి అందగత్తె కూడానూ. వీటన్నింటినీ మించి, ఏ మాత్రమో చదువు సంస్కారాలున్న మనిషి. ఇన్ని యోగ్యతలూ నీకు పనికిరాలేదంటే - పనికిరాలేదని, నీ మనస్సు అంటున్నదంటే — అది జబ్బులక్షణమే ! కాదా?'

శంకరం ఓ నిట్టూర్పు విడిచాడు.

'అదిగాదు సుందరం !' అన్నాడు శంకరం. 'నువ్వ న్నట్టు జానక్కి అన్ని యోగ్యతలూ ఉన్నాయి. ఇది కార ణంగా, ఆవిడ పెళ్ళికావడం చాలా సులభం ! నే నివ్వాళ మానేసినంత మాత్రాన, జానక్కి పెళ్ళి కాకపోదు. ఒక రకంగా - ఇలా మానేయడం, ఆవిడ మంచి కేమోనని గూడా నాకు అనిపిస్తున్నది. ఆమెనూ నన్నూ పోల్చి చూసు కొన్నప్పుడు, ఆమెతో నేనెందునా సరితూగనని నీకు తెలుసు. నే నంగీకరిస్తే, మా యిద్దరికి పెళ్ళవుతుంది. అంగీకరించ నప్పుడు, నాకన్న యోగ్యుడైనవాడే, ఆమెకు భర్తగా

దొరకవచ్చు. జానక్కి- పెళ్ళిగావడమనేది - నిజంగా ఒక సమస్య కానేకాదు.'

'కాబట్టి—?' అన్నాడు సుందరం.

'—శారదను చేసుకోవడానికి సిద్ధపడ్డాను. భూషయ్య గారి పరిస్థితులు గనుక తెలిసున్నట్లయితే, నీ విలా మాట్లాడి ఉండవు సుందరం! అన్నాడు శంకరం.

*　　*　　*　　*

దరిద్రానికి పిల్ల లెక్కువ; తద్దినానికి కూరలెక్కువ! ఈ సామెత భూషయ్యగారిపట్ల అక్షరాలా వర్తిస్తుంది. ఆయనకు, శారద గాక, ఇంకా ముగ్గు రాడపిల్లలున్నారు; ఇద్దరు మొగపిల్లలున్నారు. వస్తుతః ఆయన బడిపంతులు కావడం చేత, చదువుపట్ల అమితమైన ఆసక్తి ఉంది. కొన్ని వందలమంది పిల్లలు ఆయనదగ్గర చదువుకొన్నారు. పై చదువులకు పట్నాల కెళ్ళినవారూ, ఉద్యోగస్థులూ ఉన్నారు. వారందరిని చూస్తుంటే భూషయ్య గారికి ఎంతో ఆనందమూ, ఆ వెంటనే చెప్పరానంత దిగులూ వేసేది. ఎంతమందికి చదువు చెప్పినా, తన పిల్లలకు ఆయన పై చదువులు చెప్పించలేక పోయినాడు. పంతులు ఉద్యోగ మున్నమాటేగానీ, వచ్చి చచ్చే జీతమెంత? ఆ నాలుగు రాళ్ళతో పొట్టలు గడవడమే అంతంతమాత్రంగా ఉంటే; ఇక చదువులు దేనితో చెప్పించడం? అటు ఆస్తీలేక, ఇటు చదువూలేక, తన పిల్లలు ఏమయిపోయేట్టు? ఏమయి

పోయేట్లో భూషయ్యకు తెలిసేది కాదు. కానీ ఆయనమట్టుకు పిల్లల్ని చదివించాలని విశ్వప్రయత్నాలు చేశాడు. ఆ ప్రయత్నాలయినా, ఒక్క శారదపట్లనే రవంత ఫలించాయి. హైస్కూలు చదువు ముగిశాక, శారదను గుంటూరు పంపించడానికి, ఆయనగారు పడ్డపాట్లు ఇన్నీ అన్నీ కావు. ఇంట్లో ఉన్న నగానట్రా అమ్మి, ఆ పిల్లను ఇంటరు కణుపు దాటించాడు. అప్పటికే ఆయన పని అడుగంటి పోయింది. ఈ దిక్కుమాలిన ఇంటరు చదువు ఎందుకూ పనికిరాదని, ఆయనకు తెలిసినా, అంతకు మించి ఒక్క మెట్టు పై కెగ్రబాక లేకపోయాడు.

అదీగాక, అప్పటికే రెండో అమ్మాయీ, మూడో అమ్మాయీ, హైస్కూల్లో చదువుతున్నారు. వాళ్ళ పుస్తకాలకిందా, జీతాలకిందా చాలా డబ్బు హరించుకు పోతోంది. చేయగలిగిన ప్రయత్నాలన్నీ చేసి, ఆఖరికి శారదను ఇంటికి పిలిపించా డాయన.

పెద్ద పిల్లను పూర్తిగా చదివించలేదన్న దిగులు కన్నా, ఆ పిల్లకు పెళ్లిలా చేయడమన్న దిగులు, ఆయన్ని తినేసింది. మంచి సంబంధాలకోసం గాదు—ఓ మాదిరి వాటికన్నా ఆయన సిద్ధపడ్డాడు.

తండ్రి పడుతున్న యమయాతనలన్నీ శారదకు తెలుసు. తెలిసిగూడా ఆమె చెయ్యగలిగిందేమీ లేదు. తాను గుంటూరులో చదువుతున్నప్పుడు - చాలామంది సంస్కార ప్రియులు, తన గదిచుట్టూ తిరగడం ఆమెకింకా

జ్ఞాపకమున్నది. తన ప్రణయాన్ని అర్థిస్తూ వచ్చిన పదిపది హేను ఉత్తరాలను గూడా ఆమె మరచిపోలేదు.

వారిలో ఏ ఒక్కరు తనను పెళ్ళాడినా చాలు, తన తండ్రి భారం తీరుతుంది. కలకాలం—జీవితాంతం, ఆ వ్యక్తికి తను దాస్యం చేస్తుంది. కొన్ని వేలమంది పెళ్ళి కాని మొగవాళ్ళుండగాలేనిది, ఆడవాళ్ళెందుకు ఉండ రాదో ఎంత ఆలోచించినా శారదకు అర్థంకాలేదు.

అనేకసార్లు శారదకు జీవితంపట్ల విరక్తి కలిగింది. తనవల్ల తనకేమీ ప్రయోజనం లేదు. తన కుటుంబాని కంత కన్నా లేదు. కాకపోగా, తనో గుదిబండలా తయారయి కూచుంది. తనను చూచి, నాన్న కుళ్ళిపోతున్నాడు. అమ్మ కుమిలిపోతున్నది. తనేదో ఉద్ధరించగలదన్న నమ్మకంతో, నాన్న చదివించాడు. ఎందుకూ కొరగాని ఈ చదువుకింద చాలా డబ్బు వ్యర్థమయిపోయింది. ఆ డబ్బున్నా తన పెళ్ళయి ఉండేది; నాన్నగారికి మనశ్శాంతీ ఉండేది. తను అసాధ్యమైనవేవీ కోరడంలేదు. రుచిర స్వప్నాలు కనడం లేదు. తనకన్నా అధములైనవారికి పెళ్ళిళ్ళవుతున్నప్పుడు తనకెందుకు కాకపోవాలి ? దరిద్రమే కారణమయితే— తనా అందుకు బాధ్యురాలు ? తను చేయని తప్పుకు తనెం దుకు శిక్ష ననుభవించాలి ?

ఈ ప్రశ్నలకు జవాబుదొరక్క శారద గిలగిలలాడి పోయేది. రోజులు గడుస్తున్న కొందికీ జీవితంమీద మమ కారం సన్నగిలసాగింది. తను బ్రతికి ఏదోచేయాలనుకోవ డం వెర్రితనమని తేలిపోయింది. ఇంకా బ్రతుకును పొడి

గిస్తూ, అందరికీ, భారంగా ఉండటంకన్నా, తను చనిపోతే వచ్చే నష్టమేమిటి అనుకొంది.

శంకరం కనిపించకపోతే, శారద చచ్చిపోయేదేమో మరి! కానీ అతను కనిపించాడు. మొదటిసారి చూసినపుడు, శంకరాన్ని గురించి ఎలాంటి అభిప్రాయమూ ఆమెకు కలగలేదు. అథవా ఏదన్నా కలిగిఉంటే అది నీచమయిందే తప్ప మంచిది కాదు. కానీ నాన్న అన్నివిషయాలూ, పూసగుచ్చినట్టు అతనికి చెబుతున్నాడు. ఎంతో గుంభనగా ఉండవలసిన కుటుంబసమస్యలను నాన్న, ఈ 'అబ్బాయి'తో ఎందుకు చెబుతున్నట్టో శారదకు అంతుపట్టలేదు. పది నిమిషాలపాటు విని, తను ఇవతలకి వచ్చేసింది.

ఆ రాత్రిగానీ శారదకు అన్ని వివరాలూ తెలిశాయిగాదు. శంకరంతండ్రి తినా కుడవా ఉన్నవాడట. ఒక్కడే కొడుకట. బియ్యే చదివాడట. కొద్దిలో క్లాసు తప్పిపోయిందట. ఇన్ని యోగ్యతలూ ఉన్న మనిషి తనను చేసుకోవడానికి ఒప్పుకున్నాడట. ఆరు నూరైతే అవుగాక—తను మాత్రం ఈ నిశ్చయానికి కట్టుబడి ఉంటానన్నాడట.

ఇన్ని వివరాలు తెలిశాక, శారదకు ముంచుకొస్తున్న నిద్ర కాస్తా విచ్చిపోయింది. ఆ తెల్లవార్లూ ఆమె, అటూ ఇటూ మసులుతూనే ఉంది. మాటిమాటికీ శంకరంబొమ్మ కళ్ళముందు కనిపించసాగింది. శారద ఎంతో భక్తితోనూ, కృతజ్ఞతతోనూ, ఆ బొమ్మకు నమస్కరించింది

* * * *

'అవును. ఇలా జరగడంలో ఆశ్చర్యపడవలంసినదేమీ లేదు. ఎవరో బాధపడుతున్నారనీ, ఎవరికో పెళ్ళికాలేదనీ, నువ్వు నీ జీవితాన్ని బుగ్గిపాలు చేసుకొంటానంటావేం? ఒక్క భూషయ్య కుటుంబాన్ని సంతోషపెడదామని, నువ్వు మీ కుటుంబాన్నీ జానకి కుటుంబాన్నిగూడా సంతోషానికి దూరంచేస్తున్న సంగతి ఆలోచించవేం?' అన్నాడు సుందరం.

'ఆలోచించలేదని నువ్వెందు కనుకోవాలి? ఒక ఆదర్శంకోసం పోరాడే వ్యక్తులు, అనేక కష్టనష్టాలను ఎదుర్కోక తప్పదు. రాగల ఇబ్బందులేమిటో నేను ఊహించ గలను. ఏయే శక్తులు నన్ను నిరుత్సాహపరిచేందుకు ప్రయత్నిస్తాయో గూడా నాకు తెలుసు. కాని, ఎలాంటి అడ్డంకులొచ్చినా, నా ఆదర్శాన్ని నేను విడిచిపెట్టను. లోకంలో- ఒక్కరికన్నా ఉపయోగపడని జీవితం—కేవలం వృథా' అన్నాడు శంకరం.

'నువ్వన్నమాట నిజమే!' అన్నాడు సుందరం, 'ఈ ప్రకారమయితే, నువ్వు జానకిని చేసుకోవడం ద్వారానే ఎక్కువమందిని సంతోషపెట్టగలవేమో ఆలోచించావా?'

'లేదు, ఆలోచించదలచలేదు కూడాను. నా నిర్ణయమేదో నేను చేసుకొన్నాను. దానికిక తిరుగులేదు. ఇంత కాలమూ, మనందరమూ అంటున్న ఆదర్శాన్నే నేను ఆచరణలో పెట్టాను. అందుగ్గాను, నువ్వుగానీ, మరొకరుగాని విచారించవలసిందేమీ లేదు ... ఈ కారణంచేతనే మన స్నేహం విడిపోవలసివస్తే, అందుకుగూడా నేను బాధపడను.

ఎందుకంటే మనస్నేహంకన్నా, ఆదర్శమే నాకు గొప్పది... నీ కభ్యంతరం లేకపోతే, వచ్చే పదకొండో తారీఖున నా పెళ్ళికి రా.' అన్నాడు శంకరం, చటుక్కున లేచి నిలబడి.

సుందరం ఏదో అనబోయాడు. అంతలోకే చప్పున మానేశాడు.

## 2

గతించిన ఆ జ్ఞాపకాలన్నీ మేలుకొని శంకరాన్ని చికాకుపరిచాయి. ఒక్కసారి ఒళ్ళు దులుపుకొని ఆ భారాన్ని వదిలించుకొందామని ఆశించాడు. అతని అనేక ఆశల్లాగే, ఇదిగూడా తప్పున పేలిపోయింది.

అసలు మానవ మనస్తత్వంలోనే, ఈ విచిత్రమున్న దేమో ననిపిస్తుంది. దేన్ని అసహ్యించుకొంటామో, దేనికి దూరంగా ఉండాలనుకొంటామో, ఏది స్మృతిలోకి సైతం రావడం మన కిష్టంలేదో, అదే సంఘటన—లేదా దృశ్యం-లేదా ఇంకోటి, ఛాయలాగా మనల్ని వెంటాడుతుంది. కావాలనుకొనేవి—తారాపథంలో ఉండటమూ, అవసరంలేవనుకొనేవి — మృత్యువులా వెంటాడటమూ తప్పనిసరి అవుతోంది.

ఈ క్షణాన శంకరాన్ని చూచినవారెవరూ, అతన్ని చప్పున గుర్తుపట్టలేరు. మనిషిలో, మునుపున్నంత ఉత్సాహోతిశయాలుగానీ, కళాకాంతులుగానీ లేవు. ఎన్నో కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్న వీరుని కుండవలసిన సంతృప్తి

అతనిలో మచ్చుకుగూడా కనిపించదు. చాలా సన్నగా, జీవితంపట్ల ఆసక్తి లేనివాడిలాగా, ఘోరాపరాధం చేసి, పశ్చాత్తాపపడుతున్నవాడిలా కనిపిస్తున్నాడు.

అదృష్టవశాత్తూ శంకరం నటకుడుగాదు. అతను జీవితంలో ఏనాడూ నటించిఎరుగడు. పైపెచ్చు అలా నటించే వాళ్ళంటే అతనికి బొత్తిగా కిట్టేదికాదు. అతను ఏపని చేయనివ్వండి, మనస్ఫూర్తిగా చేసేవాడు. తను చేస్తున్న పనికి అంతరాత్మ ప్రోద్బలం లేనిదే, అత నా పనిచేసేవాడుకాదు. కాదని అతనిజీవితంనుండి రుజువులు తీసుకోవచ్చు. సుందరం అన్నట్టు ఈ మనస్సులు, అన్ని వేళలా సజావుగా పని చెయ్యవు. ఒక్కొక్క-సారి అవి చేసే అల్లరికి, వేసే వెర్రి వేషాలకు, ఓ హద్దూపద్దూ అంటూ ఉండదు. వివేకమున్నవాడు, యుక్తాయుక్తాలను విచారిస్తాడు. లేనివాడు శంకరంలాగా బాధపడతాడు.

శారదను చేసుకోడంద్వారా, తనేదో ఘనకార్యం చేశానని శంకరం అభిప్రాయం. అనేకసార్లు ఈ అభిప్రాయం అతనికి ఆనందాన్నిచ్చింది గూడాను. శారదను పెళ్ళాడి ఉండకపోతే, దన కిలాంటి ఆనందం లభ్యమవుతుందా——అని శంకరం తాత్వికంగా చింతించాడు. లభ్యమవదని తనకు తానే సమాధానం చెప్పుకొన్నాడు. మహోన్నతమూ, అపరిమేయమూ అయిన ఇలాంటి సంతృప్తి, దానిద్వారా పొందుతున్న ఆనందమూ — ఇదే చాలు తన జీవితాని కనుకొన్నాడు. ఆ 'ఆనందసీమ'లో కొంతకాలంపాటు మైమరచి విహరించాడు.

అయితే యథార్థం ఇందుకు భిన్నంగా ఉన్నది. అతని భ్రమ విచ్చిపోవడానికి రెండు సంవత్సరాలు ఎక్కడితొక్కడయ్యాయి. తనింతకాలమూ అనుభవించింది, ఆనందం కాదనీ; ఎవ్వరూ చెయ్యని పనిని, తనొక్కడే ధైర్యంగా చేశాడన్న ప్రత్యేకతే ననీ, అతను గ్రహించవలసివచ్చింది. తన మనస్సు తనను మోసగించినట్టూ, అంతరాత్మ దుర్బోధ చేసినట్టూ శంకరం అనుమానించసాగాడు.

నిజానికి ఇందులో శంకరం తప్పేమీ లేదు. ఆర్థిక దృష్టితోగాక, మానవతా దృక్పథంనుండి చూస్తే, శంకరం చేసిన పనిని (మనం) తప్పక అభినందించాలి. కొన్ని లక్షల రూపాయల ఆస్తిని గడ్డిపోచ సమంగా వదిలివేశాడు. తల్లిదండ్రుల ఆగ్రహానికి గురికాబడ్డాడు. పంచప్రాణాలు నిలుపుకొన్న జానకిని, నిర్విచారంగా త్యజించాడు. ఇవన్నీ చేయడానికి కారణం శారద! ఆమెను చేసుకోవడం వల్లనే, శంకరం ఇలాంటి త్యాగపరంపరను చేయవలసివచ్చింది. తప్పులేదు. ప్రేమించిన వ్యక్తికోసం, రాజ్యాలనూ, ప్రాణాలనూ ధారపోసినవాళ్ళున్నారు. అందుకోసం మహాయుద్ధాలు జరిగాయి. మారణహోమాలు జరిగాయి. లక్షలాది ప్రజ దారుణంగా అమానుషంగా హననంకాబడ్డది. దీన్ని మనం అర్థంచేసుకోవచ్చు. కాని, శంకరంచేసిన త్యాగాలను అర్థంచేసుకొనేందుకు ఇక్కడ 'ప్రేమ' అన్న కారణం లేనేలేదు. నిజాని కతను — అంతకుముందు శారదను చూడనుగూడా చూడలేదు. చూచిన తరువాతైనా ఆమె పట్ల శంకరానికి ఎలాంటి ఆపేక్ష కలుగలేదు, అతనికి కలిగిం

దల్లా ఆమెమీద జాలి, దయాను. అతను ఏదో ఆశించి శారదను వివాహంచేసుకొన్నాడనటం అన్యాయం. అథవా ఏదన్నా ఆశించిఉంటే, అది ఆమెనురక్షించడం మాత్రమే!

ఈ సత్కార్యం—ఇంత విషమంగా పరిణమిస్తుందని అత ననుకోలేదు. ఈ పని చాలామందికి కోపకారణ మవుతుందనీ, అనేక పరిస్థితులు, విషఝంఝులా తన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తాయనీ, అతనికి ముందే తెలుసు. తెలిసిగూడా ఈ సాహసానికి ఒడిగట్టాడు. ఎలాంటి అవాంతరాలొచ్చినా, ధైర్యంగా నిలబడితీరాలనే నిశ్చయించుకొన్నాడు. కానీ, ఆ నిశ్చయాన్ని శారద క్రమంగా బలహీనపరచసాగింది.

మహావిపత్తునుండి (1) తనను కాపాడిన దయామూర్తిగా శంకరం ఆమెకు కనిపించి చాలా కాలమైంది! అలా కనిపించిన ఆ కొద్దికాలమే, శంకరం 'ఆనందం' అనుభవించాడు.

శంకరంపట్ల ఎంతో కృతజ్ఞత చూపవలసిన బాధ్యత శారద కున్నది. ఆ బాధ్యతను ఆవిడ, ఏకొద్దికాలమో నిర్వహించి తరువాత నిశ్శబ్దంగా మరిచిపోయింది. ఇప్పు డావిడ మనస్సంతా సౌఖ్యాలమీదికి పరుగులెత్తుతున్నది. ఇరుగు పొరుగువారితో పోల్చుకొన్నప్పుడు శారదమనస్సుకుతకుతలాడి పోయేది. తమకు మేడలేదు. ముందు చిన్నతోటలేదు. కారు లేదు. సరైన బట్టలులేవు. అనువైన తిండిలేదు. వెధవది పదిరూపాయలిస్తే పడుండే, పనిమనిషికూడా లేదు; లోకంలో ఎందరెందరో సుఖపడుతున్నారు. ఎన్నో సౌఖ్యాలు, కోకొల్లలుగా ఉన్నాయి. వాటినిగురించి ఆలోచించడం మినహా,

అనుభవించలేని దరిద్రపు బ్రతుకయిపోయింది. జీవించడం, తిండీ గుడ్డా కోసమే అయితే, ఎంత వేస్టు?

ఈ విషయమే అనేకసార్లు భర్త దగ్గర ప్రస్తావించింది శారద. శంకరం దానికేదో సమాధానం చెప్పి తప్పుకొంటుండేవాడు. శారద అంటున్న దాంట్లో నిజంలేకపోలేదు. ముప్ఫై వందరూపాయల్తో మద్రాసులో బ్రతకడమంటే మాటలుకాదు. సంపాదనలో సగభాగం అద్దె మింగేస్తుంది. మిగిలినదాంట్లో సగాన్ని బస్సులు తినేస్తాయి. ఇది కారణంగానే తాము అనేకబాధలు పడవలసివస్తున్నది! అయితే తన మొఖాన్నే పొద్దు పొడవలేదు. తనకన్నా తక్కువజీతం తెచ్చుకొనేవాళ్ళు బోలెడుమంది ఉన్నారు. వాళ్ళంతా బ్రతకడంలేదా? శారద అంటున్నట్టు చావవలసిందేనా?

క్రమ క్రమంగా వాతావరణం విషమరూపం దాల్చింది. శారద సణుగుడుతో, ఎత్తిపొడుపులతో శంకరం నలిగిపోతున్నాడు. తనేదో తీరని ద్రోహం చేసినట్టు, శారద అనుకుంటున్నదని శంకరానికి తెలిసిపోయింది. బుద్ధిపూర్వకంగా, శారదకు తను చేసిన అపకారంగానీ, ద్రోహంగానీ ఏమీలేదు. అదేమన్నా ఉంటే — అనుకోకూడదు గానీ, తనకు తనే చేసుకొన్నాడు.

తను శారదకోసం చాలా నష్టపోయాడు. కన్నవారికి దూరమయ్యాడు. ప్రేమించిన జానకిని నిరాకరించాడు. కొన్ని తరాలపాటు నిర్విచారంగా బ్రతికేందుకు సరిపడే సంపదను, నిస్సంకోచంగా వదిలేశాడు. ఇదంతా శారదకోసమే! ఆమెను

రక్షించుదామనీ, ఉదరిద్దామనేగానీ, తనేదో బావుకొందామని కాదు.

కనీసం—ఈ సంగతన్నా శారద కెందుకు గుర్తురాదో శంకరానికి పాలుపోలేదు. పోనీ ఆవిడ చదువు సంధ్యలు లేని దైతే అనుకోవచ్చు. ఇంటర్ దాకా చదివింది. పరిస్థితుల ప్రభావం బాగా ఆకళింపయి ఉండాలి మరి! కానీ అదేమీ కనిపించదు. తనెంత నిస్వార్థపరుడో, తన భార్య అంతస్వార్థపరురాలు! మళ్లీ తామిద్దరూ కాపురంచేయాలి.

శారదను మార్చుదామని శంకరం చాలా ప్రయత్నించాడు. అనేక విధాల చెప్పిచూశాడు. అవేమీ ఫలించలేదు... ఒకనాడు, కారులో పోతూ జానకి కనిపించి, తామిద్దర్నీ వాళ్ళింటికి తీసుకెళ్ళింది. ఎంతగానో ఆదరించింది. ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది. అలాంటి ఆదరవాక్యాలను విని ఎంతకాలమయిందో! వస్తుతః లక్షాధికారి పుత్రిక. దానికి తోడు భర్తగూడా పుష్కలంగా ఆర్జిస్తున్నవాడు. డబ్బు ఇవ్వగలిగిన అన్ని సౌఖ్యాలూ జానకికిఅందుబాటులో ఉన్నాయి.

మేనమామ కూతురయినంత మాత్రాన, అతన్నిగానీ, శారదనుగానీ ఆదరించవలసిన అవసరం జానక్కి లేదు. రకంగా తమను ద్వేషించాలిగూడాను. కానీ జానకి దేవత! ఆమెలో దేవత్వమే తప్ప, దానవత్వం లేదు. తనెంతకాదన్నా వినకుండా, జానకి ఆ రాత్రి అక్కడే ఉండమన్నది. తను అందుకు అంగీకరించక తప్పలేదు.

ఈ సంఘటనన్నా శారదలో మార్పు తెస్తుందని శంకరం భావించాడు. తనకోసం ఎలాంటి వ్యక్తిని విడనాడాడో, ఎంతటి భోగభాగ్యాలను కాలదన్నాడో, శారద తెలుసుకొంటే, తను చేసిన త్యాగపు విలువ ఆమెకు అర్థమౌతుందని అత నాశించాడు. కానీ దానికి పూర్తి వ్యతిరేకమయిందే జరిగింది.

'అయితే నువ్వనేదేమిటి శారదా?' అన్నాడు శంకరం, తన సహనాన్ని పూర్తిగా కోల్పోయి.

'ఏమీ లేదు. నేనేమీ అనదలుచుకోలేదు కూడానూ.' అన్నది శారద ముఖం చిట్లించి. 'తమ సుఖంకోసమని చుట్టూ ఉన్నవారిని చిత్రహింసలు పెట్టే మనుషులతో, నే నేమంటే మాత్రం ఏం లాభం?'

శంకరం దిమ్మెరపోయాడు.

'ఇంతకాలం నాతో ఉండిగూడా, నన్ను గురించి నీవు తెలుసుకొన్న దిదేనా?' అన్నాడు శంకరం తేరుకొని.

'మరింకేం తెలియాలని మీ ఉద్దేశం? మీలో ఉన్నదేదో అదే తెలుసుకొన్నాను. నే నెక్కడన్నా పొరబాటు పడితే సవరించుకొంటాను. చెప్పండి!' అన్నది శారద ఒప్పుతున్నట్టు.

శంకరం కొన్ని క్షణాలు తలొంచుకొని మౌనంగా ఉండిపోయాడు. తరువాత భార్యకళ్ళల్లోకి చూస్తూ, 'నే నే స్వార్థాన్నాశించి నిన్ను చేసుకొన్నానంటావ్ శారదా?' అన్నాడు.

ఆ ప్రశ్న వింటూనే శారద ఫక్కున నవ్వింది. 'ఇంత కాలమూ, మీ రేదో మహాత్యాగంచేసినట్టు అనుకొంటు న్నారు. అలా చెయ్యడం ఓ ఘనకార్యమని మీ ఉద్దేశం. కానీ మీ రేదన్నా త్యాగం చేసిఉంటే, అది నాకోసం చెయ్యలేదు. మీ కోసం మీరే చేసుకొన్నారు. ఫలానా శంకరం గొప్ప సంస్కారహృదయుడనీ, గొప్ప త్యాగ పురుషుడనీ, పదిమందీ అనుకోవడం మీకు కావాలి. అలా అనుకొంటేనే తప్ప మీకు తృప్తిలేదు. నన్ను పెళ్ళాడటం ద్వారా, అవన్నీ మీకు దొరుకుతాయి. అందుకే పెళ్ళాడారు. పెళ్ళయినప్పణ్నించీ, నేను మీకు కృతజ్ఞత చూపించడం లేదని మథనపడుతున్నారు. నా నుంచి ఇలాటి కృతజ్ఞతలు అందుకోడంకోసమే నన్ను చేసుకొన్నారని నే నెందుకనుకో గూడదు? ఎంతటి కీర్తిదాహం మీకు లేకపోతే, మీరెంతటి స్వార్థపరులు కాకపోతే;అటు కన్నవారినీ, ఇటు దేవతలాంటి జానకినీ వదిలేస్తారు? ఇదంతా స్వార్థం కాక మరేమవుతుందో నాకు తెలియదు. మీ రెవర్నీ ఉద్ధరించలేదు. ఇకముందు గూడా ఉద్ధరించలేరు. ఎవర్నో, ఏమేమో చేశాననుకోవడం ఆత్మవంచన అవుతుంది. ఆ భ్రమను ఎంత త్వరగా వదిలించుకొంటే అంత మంచిది' అన్నది శారద.

శంకరం కళ్ళుమూసుకొని అలానే కూచుండిపోయాడు. అతనికళ్ళు నీటితో నిండిపోయాయి.

నిలయం
శ్రీకాకుళం